ఆదుకుంటున్న ఆపద్బంధువులు...

గ్రామ, వార్డు వలంటీర్లు ప్రజలకు బంధువలయ్యారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడేది వలంటీర్లే. ఏ సంక్షేమ పథకం కావాలన్నా అర్హత ఉంటే చాలు వలంటీర్‌ను సంప్రదించి లబ్ధి పొందుతున్నారు. నిరంతర పర్యవేక్షణ చేస్తూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వలంటీర్లకే చెందుతుంది. ఇవన్నీ కాకుండా వారికి అనారోగ్యం వచ్చినా, ఆపద వచ్చినా మేం ఉన్నామంటూ సాయం అందిస్తూ వలంటీర్లు ఆపద్బాంధవులవుతున్నారు.

రాజాం



సంతకవిటి మండలం మండాకురిటిలో ఇంటింట సర్వేలో వలంటీర్లు.

వలంటీర్లు లేకుంటే కష్టమే..



వలంటీర్లు లేకుంటే నాకు ఫించన్ వచ్చేదే కాదు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నన్ను గుర్తించి మా పంచాయతీ సర్పంచ్ వాకముల్ల చిన్నం నాయుడు ద్వారా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య పరీక్షలు చేయించారు. సర్పంచ్‌తో కలసి వెంటనే డయాలసిస్ విభాగంలో రూ. 10 వేలు ఫించన్ మంజూరు చేయించారు.

పోతురాజు రమణ,
అంతకాపల్లి, రాజాం మండలం.

రైతు భరోసా వచ్చింది..



ప్రారంభంలో నాకు రైతుభరోసా నగదు పడక ఇబ్బందులు వచ్చాయి. ఈ టెక్నికల్ సమస్యను వలంటీర్ పునరుద్ధరించి, రైతుభరోసా వచ్చేలా చేశారు. అంతే కాకుండా మా పంటలు ఈక్రాప్ బుకింగ్‌లోనూ, ఎరువులు, విత్తనాల పంపిణీ సమయంలో వలంటీర్లు సాయం అందించి, సకాలంలో మాకు అందేట్టు చూస్తున్నారు.

– శింగంవలస వెంకటరమణ,
రైతు, వన్నలి, రేగిడి మండలం.

సదరం సర్టిఫికెట్ చేశారు..



మా వలంటీరే మాకు అన్ని విధాలా సాయం అందిస్తున్నారు. సదరమం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు వచ్చాయి. వలంటీర్ రాకోటి సంతోషి దగ్గరుండి...మళ్లీ సర్టిఫికెట్ తీసుకొచ్చి నా ఫించన్ పోకుండా చూశారు. వారి సేవలు మరువలేనివి.

సవిరిగాన దుర్గారావు, వన్నలి, రేగిడి మండలం.

ఇంటి పట్టా ఇచ్చారు.



మా వలంటీర్ మా వివరాలు సేకరించారు. మాకు ఇంటితో పాటు ఇల్లు స్థలం లేదని గుర్తించి, జగనన్న ఇంటి పథకం ద్వారా మాకు కాలనీలో ఇంటి స్థలం పట్టా ఇప్పించి, ఇంటిని కూడా నిర్మించుకునేందుకు బిల్లులు మంజూరు చేయించారు. వలంటీర్ సేవలు చాలా గొప్పవి.

ఉట్ల లక్ష్మి, కాగితాపల్లి, రేగిడి మండలం.

ఏ పథకం వచ్చినా ముందుగా తెలుసుకుని..



వలంటీర్లు మా గ్రామంలో నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉంటున్నారు. ప్రతి సంక్షేమ పథకం వివరాలు ముందుగా వారికి తెలుస్తున్నాయి. వెంటనే లబ్ధిదారులకు సమాచారం అందించి అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కూడా వారే మంజూరు చేయించి, సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నారు.

సామంతుల అరుణకుమారి, రాజయ్యపేట, రాజాం మండలం.

క్లుప్తంగా

గృహ నిర్మాణాలు వేగవంతం



వంగర: ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: గ్రామాల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని ఎం.సీతారాంపురంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు, పలు అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

పవన్ కల్యాణ్‌పై మండిపడిన వలంటీర్లు



పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

వంగర: జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌పై మండలంలోని వివిధ గ్రామాల వలంటీర్లు మండిపడ్డారు. వలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కరోనా వంటి కష్టకాలంతో పాటు అనునిత్యం ప్రజలకు అండగా ఉంటూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లపై వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అనంతరం పవన్ డౌన్..డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ బోరెడ్డి సంగంనాయుడు, వలంటీర్లు కారు రామారావు, శంకర్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు



పశుగ్రాసంను పరిశీలిస్తున్న పశువైద్య సంచాలకుడు సత్యప్రకాష్

సంతకవిటి: మండలంలోని తాలాడలో పశుగ్రాస వారోత్సవంలో భాగంగా పశువైద్య సంచాలకుడు సత్యప్రకాష్ గురువారం రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై చేసిన నాణ్యమైన పశుగ్రాస విత్తనాలను రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. 75 శాతం సబ్సిడీపై బహువార్షిక జొన్న విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 20 సెంట్ల నుంచి ఎకరం పొలం కలిగిన రైతులకు 5 నుంచి 20 కిలోల వరకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, తాలాడ ఆర్‌బీకే ఇన్‌చార్జ్ జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ముట్టడిని విజయవంతం చేయండి

రాజాం సిటీ: ఈ నెల 20న చేపట్టనున్న మున్సిపల్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ చేపట్టనున్న ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, అనిల్, గురువులు, లక్ష్మి, గిరిబాబు, కనకరాజు, సింహాచలం, గోపి, దొరబాబు, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

రేగిడి: మండలంలోని పారంపేట, ఉణుకూరు, తదితర గ్రామాల్లో గురువారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ, ఆర్‌బీకేలు రైతులకు ఎంతో చేయూతగా ఉంటాయన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రైవేట్ వర్తకుల వద్ద ఎరువులు కొనవద్దని సూచించారు.

ఖరీఫ్ సీజన్ వరకు ఉపాధి పనులు

రాజాం: మండలంలో ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభమయ్యేవరకు వేతనదారులకు ఉపాధి పనులు ఉంటాయని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఏపీఓ సాయిరాం అన్నారు. మండలంలోని దోసరి రామినాయుడువలస, మారేడుబాక గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేసుకోవాలని వేతనదారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యసేవలు

రాజాం: పట్టణంలోని అమృత హాస్పిటల్ వద్ద రేగిడి మండలం వావిలవలస గ్రామానికి చెందిన 30 మంది పేదలకు గురువారం ఉచితంగా వైద్యసేవలందించారు. గ్రామానికి చెందిన రాహుల్ సౌరభ్ నిత్యాన్నదాన సత్రం నిర్వాహకులు పాలూరి సిద్ధార్థ సత్రానికి చెందిన పేదలను ఆస్పత్రికి తీసుకురాగా.. ఆస్పత్రి ఎం.డి గార రవిప్రసాద్ వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు.

విద్యార్థులకు చేయూత..



అప్పాపురం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓలు.

రేగిడి: మండలంలోని అప్పాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు కృష్ణా జిల్లా సబ్బవరానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ గురువారం పుస్తకాలను అందించింది. 75 మంది విద్యార్థులకు ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి. ఎరకయ్య, సర్పంచ్ కరణం శ్రీనివాసరావు నోట్ పుస్తకాలు, పెన్నులు, మ్యాథ్స్ బాక్సులు అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ తమ సేవలను మరింత విస్తృతం చేయనుందని సొసైటీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ సంకాభక్తుల భవాని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్, హెచ్‌ఎం పొగిరి శ్రీదేవి, ఉపాధ్యాయులు నల్లా సుదర్శనరావు, సొసైటీ సభ్యులు ఎస్.గణేష్, మాకాన సాయి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేతో అన్నదాతకు ప్రయోజనం



రేగిడి : మునకలవలస గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

రేగిడి : జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష పథకంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని తహసీల్దార్ టి. కల్యాణచక్రవర్తి అన్నారు. మండలంలోని వనసలవలస, మునకలవలస గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, గ్రామాల్లోకి సర్వే సిబ్బంది వచ్చే సమయంలో రైతులు అక్కడే ఉండి సక్రమంగా సర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, గేదెల గోవిందరావు, వీఆర్‌ఓ ఏవీ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయానికి పాల్పడితే చర్యలు



దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: ట్రాఫిక్ అంతరాయానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తిరుమలరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జాతీయ, రాష్ట్ర రహదారి పక్కనే ఉన్న దుకాణదారులు, వాహనదారులతో సమావేశమైన ఆయన మండల కేంద్రంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపుగా బొబ్బిలి వైపు వెళ్లే రహదారి చివరి వరకు కొంత మేర రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలన్నారు. రోడ్డును ఆనుకుని దుకాణాలు ఉండడంతో కొనుగోలుదారులు రోడ్డు మీద వాహనం నిలపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తరచూ తలెత్తుతోంది. దుకాణాల వద్ద వాహనాలు నిలపకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ సురేంద్రనాయుడు, ఏఎస్ఐ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డుల్లో ఫీజుల వివరాలను ప్రదర్శించాలి

బొబ్బిలి: పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఇదే విషయమై స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ గొట్టాపు వాసుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఫీజులు ఏ మేర తీసుకుంటున్నారోనన్న విషయం అందరికీ తెలియాలన్నారు. అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై దర్యాప్తు చేయాలి

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాలతో స్థలాలు అమ్ముకుంటున్నారని, దీనిపై దర్యాప్తు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడిన ఆయన పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఇళ్లను కొంత మంది ధనికులు కొనుగోలు చేసి, ఇళ్లు కట్టుకుంటున్నారని ఆరోపించారు. అలాగే ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించాలని, ప్రభుత్వ ఆక్రమిత ప్రదేశాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేత

బొబ్బిలి: తమకు అందజేయాల్సిన బకాయి వేతనాలను తక్షణమే ఇవ్వాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కోరారు. ఇదే విషయమై వారు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అధికారులు గురువారం వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలు కాలంలో పనిచేసిన తమకు నాలుగు నెలల వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. అలాగే తమకు అగ్రిల్యాబ్ కార్యాలయాల్లో కూడా ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో కె.వంశి, ఆర్.శ్రీనివాసరావు, బి.మహేష్, టి. రవితేజ, సీహెచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


సైదాల లయ

మాణిక్యం రోషిణి

ప్రవళిక

బి.సోమశేఖర్

పి.సాయికిరణ్,

పి.హర్షవర్ధన్

జి.వినోద్

జి.హరికృష్ణ

ఎం.వినయ్

ఎస్.లోకేష్

బి.అజయ్‌కుమార్

వావిలపల్లి గౌతమి

పైడి శ్వేత

పి.పల్లవి

ఎల్.కీర్తన

కొరికాన మదన్

కె.వెంకటసాయి

పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులు

రాజాం సిటీ: మండల పరిధిలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం వీవీ వసంతకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, సైదాల లయ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి...మాణిక్యం రోషిణి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామానికి చెందిన కునుకు భావన, గేదెల అనూషలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు. పెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన వీరికి పదో తరగతి పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరిగింది.

రామభద్రపురం: మండలంలోని ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కొట్టక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉప్పల ప్రవళిక పదో తరగతిలో 572 మార్కులు సాధించి, ఒంగోలులో ట్రిపుల్ ఐటీ సీటు దక్కించుకోగా, ఆరికతోట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సూరాబత్తుల లహరి పదో తరగతిలో 568 మార్కులు సాధించి, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది.

బొబ్బిలి: మండలంలోని కారాడ(కోమటిపల్లి) మహాత్మా జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాలలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఉన్న ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. గురువారం ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోది విలేకరులతో మాట్లాడుతూ బడే సోమశేఖర్, పెంట సాయికిరణ్, పూడి హర్షవర్థన్, గండిపిల్లి వినోద్‌లు నూజివీడు ట్రిపుల్ ఐటీకి, గంట హరికృష్ణ, మరడాన వినయ్‌కుమార్, సబ్బవరపు లోకేష్, బంటు అజయ్‌కుమార్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి, గుల్ల యశ్వంత్‌కుమార్‌నాయుడు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

సంతకవిటి: మండలంలోని కేజీబీవీలో చదివిన పైడి శ్వేత (నూజివీడు), వావిలపల్లి గౌతమి(శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ఎస్‌ఓ ఎ. ప్రభ తెలిపారు. అలాగే సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి పి.పల్లవి (నూజివీడు), ఎల్.కీర్తన(శ్రీకాకుళం) ఐఐఐటీకి ఎంపికై నట్లు హెచ్‌ఎం వి. వెంకటరమణ తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఖండ్యాం విద్యార్థులు...

రేగిడి: మండలంలోని ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం జి.నాగభూషణదొర తెలిపారు. కొరికాన మదన్, కింజరాపు వెంకటసాయి ఈ ఘనత సాధించారన్నారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

‘జగనన్న సురక్ష’తో ప్రజలకు మేలు

గ్రామ గ్రామాన ఓ యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరా తీసి, అవి వారికి అందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. గురువారం పలువురి ఇళ్ల వద్దకే వెళ్లి, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువపత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేశారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.



మెంటాడ: తాము అందుకున్న ధ్రువీకరణ పత్రాలు చూపిస్తున్న అర్జీదారులు



తెర్లాం: ఎం.ఆర్ అగ్రహారంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ



బాడంగి: డొంకినవలసలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ గౌరి



రామభద్రపురం: తారాపురంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు



బొబ్బిలి: పక్కి గ్రామంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మి



వంగర: వీవీఆర్‌పేటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి



సంతకవిటి: గరికిపాడులో లబ్ధిదారునకు ధ్రువపత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు



రాజాం : డీఆర్‌ఎన్ వలసలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు



రాజాం సిటీ: లబ్ధిదారునికి ధ్రువీకరణపత్రం అందిస్తున్న అధికారులు.

కనీస వేతనం చెల్లించాలి

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ నేత బలస శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారం రోజులుగా సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికీ నెలకు రూ.10 వేల చొప్పున వేతనం ఇవ్వాలని జీఓ విడుదల చేసిందన్నారు. అయినా అధికారులు దానిని అమలు చేయడం మరిచారన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

500 మందికి వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ఆదిత్య పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్, చిన్నమాంబ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో సుమారు ఐదు వందల మందికి వైద్యసేవలు అందజేశారు. పలువురిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులు సంతోష్, శ్రవణ్, రాజశేఖర్, గోవింద, తదితరులు పాల్గొన్నారు.